క్లుప్తంగా

శ్రీగోదాదేవి అమ్మవారికి సారె



దావాజీగూడెం(గన్నవరం): మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీగోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. తొలుత అమ్మవారికి విశేష అర్చనలు, కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి సారెతో పాటు 54 రకాల స్వీట్లు, 21 రకాల పండ్లను నైవేద్యంగా సమర్పించారు. పదకొండు రకాల పూలతో శ్రీగోదాదేవి సమేత శ్రీకృష్ణాస్వామివార్లకు, ఆలయ ప్రాంగణంలో జరిపిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, ఉయ్యూరు, గుడివాడ, విజయవాడ, గన్నవరం, కేసరపల్లి ప్రాంతాలకు చెందిన చిన్నజీయర్‌స్వామి భక్తులు పాల్గొన్నారు.

5న సంక్రాంతి సంబరాలు

పెనమలూరు: కమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు గురువారం వివరాలు తెలుపుతూ ఆదివారం గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రంగాల్లో ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేస్తామని పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఆక్రమణలు తొలగించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు దండు సుబ్రహ్మణ్యంరాజు అధికారులకు విజ్ఞప్తిచేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామసభ జరిగింది. ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి అనేక చోట్ల ఆక్రమణలు జరగడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. పలు సమస్యలను పాలక సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పీఎం సూర్యఘర్ పథకం గురించి విద్యుత్ ఏఈ వివరించారు. గ్రామ ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పాలకవర్గ సభ్యులు, ఇన్‌చార్జి కార్యదర్శి పి.శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే పి.నైనవరం గ్రామ సర్పంచి బట్టా సోమయ్య అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. అంబాపురంలో గ్రామసభ మొక్కుబడిగా జరిగింది. గ్రామ సర్పంచి, ఉపసర్పంచి ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు.

సస్య రక్షణ చేపట్టాలి



పెనమలూరు: మినుము-మొక్కజొన్న పంటలకు పురుగు, తెగుళ్లు ఆశించకుండా సస్య రక్షణ చర్యలు చేపట్టాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్స్ అధికారులు(డీఆర్‌సీ) తెలిపారు. గంగూరు, యనమలకుదురులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు సరిపడా ఎరువులు మాత్రమే వాడాలని సూచించారు. పురుగు మందు వాడే ముందు సలహాలు తీసుకోవాలన్నారు. మొక్కజొన్న విత్తనాలు, విత్తన మోతాదు గురించి రైతులకు వివరించారు. రైతులు ఖర్చు తగ్గించి దిగుబడులు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్స్ అధికారులు శ్రీనివాస్, జ్యోతిర్మయి, మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, వీఏఏలు జమీలఅంజుమ్, శ్రీవాణి, అహల్య, రైతులు పాల్గొన్నారు.

ఉద్యానవన సాగుకు ప్రోత్సాహకాలు

గన్నవరం రూరల్: ఉద్యానవన సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని మండల హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ తెలిపారు. గురువారం ఆయన వివరాలు తెలుపుతూ మూడు సంవత్సరాల కాలానికి మామిడి సాగు విస్తరణకు హెక్టారుకు రూ.13,300లు, జామకు హెక్టారుకు రూ.29,331లు, నిమ్మకు హెక్టారుకు రూ.16,004లు, రెండేళ్లకు కొబ్బరికి హెక్టారుకు రూ.6,500లు సబ్సిడీగా ప్రభుత్వం ఇస్తుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయండి

హనుమాన్‌జంక్షన్ రూరల్: కేసరపల్లిలో ఈ నెల ఐదవ తేదీన జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ గన్నవరం ఖండ కార్యవాహ ఎదురువాడ శ్రీనివాసరావు, ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు కోరారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ హైందవ శంఖారావం కరపత్రాలను అందించి ఆహ్వానం పలికారు. ప్రతి హిందువు తప్పనిసరిగా సభకు హాజరై ఐక్యతను చాటిచెప్పాలని విజ్ఞప్తి చేశారు.

బకాయిల వసూళ్లలో బద్ధకం

- తాడిగడప మున్సిపాలిటీలో రూ. 13.60 కోట్ల మేర నిలిచిన పన్నులు
- ఇప్పటి వరకు 52 శాతం మాత్రమే వసూళ్లు
- సిబ్బంది, గృహ యజమానుల మధ్య సమన్వయలోపం



తాడిగడప మున్సిపాలిటీలో గృహాలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో ఆదాయ వనరులు అంతంత మాత్రంగా ఉండగా ఇప్పుడు పన్నుల బకాయిలు భారంగా మారింది. మున్సిపాలిటీలో వనరుల సమీకరణ, పన్నుల వసూళ్లలో ఉద్యోగులకు, గృహ యజమానులకు మధ్య సమన్వయలోపం కనబడుతోంది. దీని కారణంగా పన్నుల బకాయిలు నానాటికీ పేరుకుపోతున్నాయి. వివరాల్లోకి వెళితే.. యనమలకుదురు, కానూరు, పోరంకి, తాడిగడప గ్రామాలను విలీనం చేసి గత ప్రభుత్వం వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. మున్సిపాలిటీ ఏర్పడి దాదాపు నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ మున్సిపాలిటీలో పాలన గాడిలో పడలేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ఇందుకు ఉదాహరణగా పన్నుల వసూళ్లను పరిగణలోకి తీసుకోవచ్చు. విజయవాడ నగర శివారు తాడిగడప మున్సిపాలిటీలో నివాసాలు నానాటికి పెరుగుతున్నా అదే స్థాయిలో ఆదాయ వనరులు మాత్రం పెరగడం లేదు. పన్నులు బకాయిల వసూళ్లలో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి వసూళ్లు ప్రశ్నార్థకంగా మారింది.

అన్ని సచివాలయాల్లోనూ పన్నుల బకాయిలు

తాడిగడప మున్సిపాలిటీలో గృహాలు(అసెస్‌మెంట్లు) 46,970 ఉన్నాయి. ఇందులో కానూరులో 16,422, పోరంకిలో 11,213, తాడిగడపలో 7,300, యనమలకుదురులో 12,035 చొప్పున ఉన్నాయి. అయితే కానూరు, పోరంకి, యనమలకుదురు ప్రాంతాల్లో పన్నులు సక్రమంగా వసూళ్లు కావడం లేదు. కానూరు పరిధిలో పన్నుల బకాయిలు రూ. 6.22 కోట్లు, పోరంకిలో రూ. 3.14 కోట్లు, తాడిగడపలో రూ. 1.44, యనమలకుదురులో రూ. 2.80 కోట్లు చొప్పున వసూళ్లు చేయాల్సి ఉంది. మున్సిపాలిటీలో 19 సచివాలయాలు ఉండగా అన్ని సచివాలయాల్లోనూ పన్నుల బకాయిలు ఉన్నాయి. ఇప్పటి వరకు 52 శాతం మాత్రమే పన్నులు వసూళ్లు చేయగలిగారు.

జరిమానా కూడా బకాయినే

పన్నులు సకాలంలో చెల్లించకపోతే ప్రభుత్వం జరిమానా విధిస్తుంది. వింతలో వింత ఏమిటంటే సకాలంలో పన్నులు చెల్లించని వారికి జరిమానా భారీగా పడుతున్నా యజమానులు ఏమాత్రం స్పందించడం లేదు. మున్సిపాలిటీలో పన్నులు బకాయి ఉంటే కంప్యూటర్‌లో పన్నుల బకాయి ప్రతినెలా నెల వారిగా గుణించబడి వడ్డీతో చూపుతుంది. మున్సిపాలిటీ ఇచ్చే పన్నుల డిమాండ్‌లో జరిమానా కూడా భారీగా పేరుకుపోయింది. గత బకాయిలో జరిమానాతో వడ్డీ రూ. 1.79 కోట్లు కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 37.64 లక్షలు కలిపి మొత్తం జరిమానా బకాయిలు రూ. 2.17 కోట్లుంది. ఈ లెక్కన మున్సిపాలిటీలో పన్నులు ఏ విధంగా పూర్తి స్థాయిలో వసూళ్లు చేస్తారనేది ప్రశ్నగా ఉంది.

పన్నుల వివరాలు ఇలా ఉన్నాయి

గత పన్నుల బకాయి	రూ. 8.09 కోట్లు
ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల డిమాండ్	రూ. 19.08 కోట్లు
మొత్తం పన్నుల బకాయి	రూ. 27.17 కోట్లు
ఇప్పటివరకు వసూళ్లు అయిన పన్నులు	రూ. 13.56 కోట్లు
ఇంకా వసూళ్లు కావల్సిన బకాయి	రూ. 13.60 కోట్లు

ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

గతంలో గ్రామ పంచాయతీలు ఉన్న కాలంలో బిల్లు కలెక్టర్ ఇళ్లకు వెళ్లి పన్నుల డిమాండ్ ఇచ్చి స్పాట్‌లో వసూళ్లు చేసుకునే వారు. అయితే మున్సిపాలిటీలో ఈ విధంగా జరగడం లేదు. పన్నుల వసూళ్లు ఎలా ఉన్నా అసలు పన్నుల డిమాండ్ నోటీసులు కూడా గృహ యజమానులకు ఇవ్వడం లేదు. సచివాలయ సిబ్బంది అడుగు బయటపెట్టడం లేదు. ప్రభుత్వం వారికి ఇతర పనులు కేటాయించడంతో పన్నుల విషయంలో సచివాలయాల సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినబడుతున్నాయి. వలంటీర్ల వ్యవస్థ లేకపోవడంతో పాలనలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పన్నుల వసూళ్లు అధిగమించాలంటే సకాలంలో పన్నుల డిమాండ్ రశీదులు అందజేసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తే మున్సిపాలిటీ ఖజానాకు సొమ్ము చేరుతుంది.

చర్యలు చేపడతాం



పన్నులు వేగవంతంగా వసూళ్లు చేయడానికి చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తాం. గృహ యజమానులు మా సిబ్బందికి సహకరించాలి.

– భవానీప్రసాద్, కమిషనర్, తాడిగడప మున్సిపాలిటీ

ఘనంగా జాగృతి రజతోత్సవం



జాగృతి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ దివి చిన్మయ

ఉయ్యూరు: పేదల జీవితాల్లో ప్రగతికి జాగృతి కోఆపరేటివ్ సొసైటీ ఆసరాగా నిలవడం అభినందనీయమని యూనివర్సల్ సొసైటీ ఫర్ ఆయుర్వేదిక్ చైర్మన్ డాక్టర్ దివి చిన్మయ అన్నారు. ఉయ్యూరులోని జాగృతి కోఆపరేటివ్ సొసైటీ రజతోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో కేక్ కట్ చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. ఉయ్యూరు, పరిసర గ్రామాల పేద కుటుంబాలకు జాగృతి సంస్థ అండగా నిలుస్తుందన్నారు. సంస్థ సీఈఓ గబ్బిట వెంకటరమణ మాట్లాడుతూ సేవా భావంతో ప్రజల సంక్షేమం కోసమే సొసైటీని నడుపుతున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది టి.చంటిబాబు, సొసైటీ పాలకమండలి అధ్యక్షురాలు పామర్తి రాజీవి, సభ్యులు షేక్ ఫజులుల్ మొయిద్, శీలం శ్రీనివాసరావు, కాజ శివయ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాదిగ కుల జాబితాలో పొరబాట్లు సరిచేయాలి



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మాదిగ కుల జాబితాలో మాలలుగా నమోదైన పొరబాట్లను సరిచేయాలని గన్నవరం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ బాధ్యుడు మంద వేణుమాదిగ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గ్రామ సచివాలయంలో గురువారం వినతి పత్రం సమర్పించారు. జాబితాలో అనేక మంది పేర్లు గల్లంతైనట్లు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. వాటిని సరిచేసి మాదిగ కుల జాబితాను ప్రచురించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిల్లిముంత కోటేశ్వరరావు, ప్రత్తిపాటి సుందరయ్య, గుడ్డేటి రాజేష్, ప్రత్తిపాటి జాన్‌రవి, ముల్లంగి రాజు, కూనిపాగ నాని పాల్గొన్నారు.

సాంస్కృతిక సేవలు ఆదర్శనీయం



అప్పాజోస్యుల సత్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: అభో,విభో, కందాళం ఫౌండేషన్(అప్పాజోస్యుల, విష్ణుభొట్ల కందాళం) ద్వారా కళాసేవలను చేస్తున్న అప్పాజోస్యుల సత్యనారాయణ, డీఎస్ఎన్ మూర్తి సేవలు వెలకట్టలేనివని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. తెలుగు డ్రామా గ్రూప్, సంస్థల ఆధ్వర్యంలో సాంస్కృతిక కళారంగాలకు విశేష సేవలతో పాటు జాతీయ స్థాయిలో నాటికల పోటీలు నిర్వహిస్తున్న అప్పాజోస్యుల సత్యనారాయణ, డీఎస్ఎన్ మూర్తి సేవలను గుర్తు చేసుకుంటూ వారికి 80 సంవత్సరాలు నిండిన సందర్భంగా బందరు రోడ్డులోని మాకినేని బాలోత్సవ భవన్‌లో గురువారం సత్కార కార్యక్రమం నిర్వహించారు.

నాటక రంగానికి పూర్వవైభవం

ముఖ్య అతిథిగా పాల్గొన్న గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. దేశ విదేశాలలో తెలుగు వారి సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నారన్నారు. నాటక అకాడమీ ద్వారా నాటకానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాటక రచయిత దర్శకుడు కందిమళ్ల సాంబశివరావు అప్పాజోస్యుల, డీఎస్ఎన్ మూర్తి సేవలను అభినందించారు. సత్కార కార్యక్రమంలో కళావిపంచి నిర్వాహకులు డి.రామకోటేశ్వరరావు, బొప్పన నరసింహరావు, కేవీ రామానుజాచార్యులు, నాటక రంగ ప్రముఖులు వైఎస్ కృష్ణేశ్వరరావు, డొగిపర్తి శంకరరావు తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు అప్పాజోస్యులను, మూర్తిలను ఆత్మీయంగా సత్కరించారు. పెద్ద సంఖ్యలో నాటక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. బుధవారం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై అకాడమీకి చెందిన గురువులు చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ సారథ్యంలో 15 మంది కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం ఆలయ ప్రాంగణానికి చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. ఆలయ డీఈవో రత్నరాజు శిష్యబృందాన్ని అభినందించారు.

నిలువ నీడ లేదు

- ప్రధాన కూడళ్లల్లో బస్ షెల్టర్లు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



రామవరప్పాడు రింగ్‌లో ఫుట్‌బోర్డుపై నిలబడి బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

రామవరప్పాడు: విజయవాడ నగరానికి ఆనుకుని ఉన్న రామవరప్పాడు రింగ్‌తో సహా పలు గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఏళ్ల తరబడి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే పలు గ్రామాల్లో అధికారులు కనీసం బస్ షెల్టర్లు నిర్మించడంలో శ్రద్ధ వహించడం లేదు. దీంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తప్పని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. రింగ్ సమీపంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం సమీపంలో జాతీయ రహదారిపై నిత్యం గన్నవరం, హనుమాన్‌జంక్షన్, ఏలూరు వైపు వెళ్లే బస్సులు ఆగుతుంటాయి. ప్రయాణికులు, ఉద్యోగులు విద్యార్థులు ఈ బస్సుల్లోనే పలు గ్రామాల మీదుగా తమ గమ్య స్థానాలకు ప్రయాణాలు సాగిస్తుంటాయి. అలాగే ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులతో పాటు సిటీ బస్సులు ఈ గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఆపుతుంటారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారి కూలీలు తమ గమ్య స్థానాలు చేరుకోవడానికి పెద్ద సంఖ్యలో బస్సుల కోసం వేచి ఉంటారు. బస్ షెల్టర్లు లేకపోవడంతో ఫుట్ బోర్డుపైనే నిలబడాల్సి వస్తోంది. ఒక్కోరోజు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదమని తెలిసినా తప్పక రహదారిపై వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం

ఆయా గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే చిన్నారులు, వృద్ధులు పడే అవస్థలు వర్ణనాతీతం. బస్సుల కోసం ఎండలో నిలబడి.. నిలబడి కళ్లు తిరిగి పడిపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షం పడినప్పుడల్లా సమీప షాపులు, దుకాణాల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో వందల సంఖ్యలో రాకపోకలు సాగించే వాహనాలతో జాతీయ రహదారిపై బస్సుల కోసం వేచి చూస్తూ భయాందోళనలకు గురి అవుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

నగరానికి అతి సమీపంలో ఉన్న పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రామవరప్పాడు నుంచి గూడవల్లి వరకు బస్ షెల్టర్లు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు, కళాశాలలు ఉన్న స్టాప్‌ల వద్ద కూడా బస్ షెల్టర్లు కరువయ్యాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థుల అవసరార్థం బస్ షెల్టర్లు నిర్మించాలని ముక్త కంఠంతో కోరుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికి దోహదం



అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

కేసరపల్లి(గన్నవరం): రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారానికి దోహదం చేస్తున్నామని తహసీల్దారు కె. వెంకటశివయ్య పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మిమౌనిక అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో తహసీల్దారు పాల్గొన్ని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై సమగ్ర విచారణ జరిపి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో మొత్తం 13 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి జీవీఎల్‌ఆర్‌ఆర్‌వీ ప్రసాద్, వీఆర్వో డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉంగుటూరు: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని హెచ్‌ఎం టి.సీతారామ్ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సీతారామ్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక జెడ్పీ హైస్కూల్‌లో గత నెల 29వ తేదీన జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 విభాగంలో పాఠశాల విద్యార్థిని కుంభా స్వాతి కృష్ణా జిల్లా జట్టుకు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. తన క్రీడా నైపుణ్యంతో స్వాతి, స్మైలీ జట్టు విజయం సాధించేందుకు కృషి చేశారని తెలిపారు. అలాగే జాతీయ స్థాయి పోటీకి అండర్-14 బాలుర విభాగంలో కామినేని వెంకటసాత్విక్, హర్ష ఎన్నికయ్యారని వివరించారు. విజేతలను హెచ్‌ఎం సీతారామ్, విద్యా కమిటీ చైర్మన్ చోరగుడి లక్ష్మి, పుట్ల విజయ్‌భాస్కర్, సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, కెనరా బ్యాంక్ మేనేజర్ రవి, పీహెచ్‌సీ డాక్టర్లు శిరీష, సుబ్బారావు అభినందించారు.

చలివేంద్రపాలెంలో అయ్యప్ప ఇరుముడులు



ఇరుముడులు ధరిస్తున్న అయ్యప్పమాల ధారులు

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో అయ్యప్పస్వామి ఇరుముడుల కార్యక్రమం గురువారం నిర్వహించారు. గురుస్వామి మరీదు శివశంకర్ ఆధ్వర్యంలో 18 మంది అయ్యప్ప మాలధారులు స్థానిక ఆలయంలో ఇరుముడులు ధరించి శరణం అయ్యప్ప అంటూ శబరిమలకు బయలుదేరి వెళ్లారు. ఇరుముడి కార్యక్రమాన్ని గురుస్వామి కోసూరు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక బాపులపాడులోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ట జరిగి మండల కాలం పూరైన సందర్భంగా స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, బిల్వార్చన వైభవంగా జరిగింది. అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యా రంగాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది



మాట్లాడుతున్న నాసర్ జీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ విమర్శించారు. హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాలల యాజమాన్యాలు నిలిపివేసిందన్నారు. ఫలితంగా విద్యార్థులు నిరుద్యోగులుగా మారారని, ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే వారందరికీ రూ.15 వేలు తల్లికి వందనం ఇస్తామన్నారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎగనామం పెట్టారన్నారు. అలాగే జీవో 77 రద్దు చేస్తామంటూ ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయి రాష్ట్ర విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం సంబరాలకు ఇచ్చిన ప్రాధాన్యత విద్యా రంగ సమస్యలకు ఇవ్వడం లేదని చెప్పారు. విద్యా రంగ సమస్యలపై కేబినెట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్, జిల్లా కార్యదర్శి కార్తీక్, నగర అధ్యక్ష కార్యదర్శులు జగదీష్, రంజిత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై దాడి

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఇద్దరు యువకులపై పలువురు దాడి చేయడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు విశ్వశాంతినగర్‌లో కటకం మణికంఠ ఉంటున్నాడు. అతను కార్పెంటర్ పనులు చేస్తాడు. అయితే ఈ నెల ఒకటవ తేదీన అతను లంబాడీపేటలో ఉంటున్న మిత్రుడు అర్జున్‌నాయక్ వద్దకు వచ్చారు. అందరు కలిసి క్రికెట్ ఆడుతుండగా అదే ప్రాంతానికి చెందిన శ్యామ్‌నాయక్ మద్యం సేవించి వచ్చి క్రికెట్ ఆడుతున్న పిల్లలను అకారణంగా కొట్టాడు. ఎందుకు పిల్లలను కొట్టావని మణికంఠ, అర్జున్‌నాయక్‌లు ప్రశ్నించగా వారితో శ్యామ్‌నాయక్ గొడవపడి వెళ్లిపోయాడు. కొద్ది సమయం తర్వాత శ్యామ్‌నాయక్, నాగరాజు, పాపారావు, మరి కొందరు యువకులు వచ్చి మణికంఠ, అర్జున్ నాయక్‌లపై దాడి చేసి గాయపరిచారు. గాయాలు అయిన ఇద్దరు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన గురువారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీ గోదారంగనాథ స్వామివార్లకు బ్రహ్మీ ముహూర్తంతో పూజలు చేసి శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.